24-06-2015 ఉదయము మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనము

## " ఈ దుఃఖ ప్రపంచములో ఏ కోరికా ఉంచుకోరాదు, సుఖమునిచ్చే ప్రపంచములోకి వెళ్లేందుకు సంస్కారాలను దైవీ సంస్కారాలుగా తయారు చేసుకోవాలి. "

### (మాతేశ్వరి గారి మహావాక్యాలు)

**పాట :- ఎవరో నన్ను తమవారిగా చేసుకొని నవ్వుట నేర్పించారు........(కిసీ నే హమ్‌కో బనాకే అప్‌నా ముస్కురానా సిఖా దియా)**

ఒకటేమో నవ్వుతూ సంతోషముగా ఉండు ప్రపంచము, రెండవది ఏడుస్తూ ఉండే ప్రపంచము............. ఇప్పుడు మీరెక్కడ కూర్చొనిఉన్నారు? ఏడ్చే ప్రపంచము అంత్యములో, నవ్వే ప్రపంచము లేక సుఖ సంతోషాల ప్రపంచము ప్రారంభములో అనగా ఇప్పుడు సుఖ ప్రపంచము యొక్క అంటు కట్టబడుతూ ఉంది. మనము సంగమ సమయములో ఉన్నాము, ఇప్పుడు మనము ఆ సుఖ ప్రపంచము కొరకు పురుషార్థము చేస్తున్నాము. కనుక మన గమనము పూర్తిగా దాని పైనే ఉంది. ఇప్పుడీ ఏడ్చే ప్రపంచము అనగా దుఃఖ ప్రపంచములో ధన-సంపదల పై గాని, పదవి పై గాని, గౌరవ-మర్యాదలు కావాలనిగాని ఏ విషయములోను కావాలనే కోరిక ఉంచుకోరాదు. ఎందుకనగా ఇప్పుడు అన్నిటిలో ధన -సంపదలలో కూడా ఏడుపే అనగా దుఃఖమే ఉంది. ఈ ప్రపంచములోని ఏ ప్రాప్తినీ ప్రాప్తిగా లెక్కించలేము. ఆ ప్రాప్తులలో ఇప్పుడు ఏ సుఖమూ లేదు, అందుకే తండ్రి చెప్తున్నారు - నేను నవ్వే ప్రపంచమును అనగా సదా సుఖముగా ఉండు ప్రపంచమును దేనినైతే స్థాపన చేస్తున్నానో అందులోకి వచ్చుటకు మీ సంస్కారాలను కూడా అలా తయారు చేసుకోండి. చిత్రకారుడు కూడా దేవతా చిత్రముల ముఖాలను చాలా మంచి మందహాసము చేస్తున్నవారిగా తయారు చేస్తాడు. వారి ముఖములో పవిత్రత, దివ్యత మొదలైనవి కనిపిస్తాయి. ఇప్పుడు మనము అదే సంస్కారాన్ని తయారు చేసుకుంటున్నాము లేక ధారణ చేస్తున్నాము. అచ్చట ఎలాంటి దుఃఖ చిహ్నాలు ఉండనే ఉండవు. అక్కడ ఎప్పుడూ ఏడుపే ఉండదు. కనుక తండ్రి చెప్తున్నారు - ఇప్పటికే చాలా ఏడ్చారు, ఎంతో దుఃఖాన్ని పొందారు అనగా దుఃఖ ప్రపంచములో అనేక జన్మలు దుఃఖమును అనుభవించారు. ఇప్పుడా రాత్రి సమాప్తమై పగలు కూడా వస్తుంది కదా. అందువలన ఈ రాత్రి లేక దుఃఖమునిచ్చు తరాలిప్పుడు సమాప్తమై సుఖమునిచ్చు తరాలు ప్రారంభమౌతాయి. సుఖమునిచ్చు ప్రపంచానికి పునాది ఇచ్చటే వేయాలి. అందువలన చాలా జాగరూకతతో ఉండాలి. ఇప్పుడు పునాది వేస్తే వేసినట్లు వేయకుంటే సదా కొరకు ఆ సుఖమును ప్రాప్తి చేసుకొనుట నుండి వంచితులుగా ఉండిపోతారు. మనుష్య జన్మ అతిదుర్లభమని గాయనము చేశారు కదా. ఆ గాయనము ఏ జన్మ కొరకు? ఈ జన్మ కొరకే. ఎందుకంటే అలాంటి జన్మలైతే చాలా ఉన్నాయి. కాని అన్నిటికంటే ఎక్కువ మహిమ ఈ జన్మకే ఉంది. ఎందుకంటే ఇప్పుడు మనము మన ఉన్నత తరాలకు పునాది వేస్తున్నాము.

మనుష్య జన్మ 84 లక్షల యోనుల ద్వారా లభిస్తుందని చాలా మంది భావిస్తారు. కనుక ఈ

మానవ జన్మ అతిదుర్లభమని భావిస్తారు. 84 లక్షల యోనుల తర్వాతనే ఒక్క సుఖమునిచ్చు జన్మ లభిస్తుంది. కాని అలాగైతే మనుష్యులందరూ సుఖంగా ఉండాలి కదా. మరి ఇంత దుఃఖమెందుకు అనుభవిస్తున్నారు? మనుష్యులకు మనుష్య రూపములోనే తను జన్మ తీసుకొని సుఖ-దుఃఖాలను కర్మ లెక్కాచారమును అనుసరించి అనుభవించే తీరాలి. అంతేగాని ఏవైనా పశుపక్ష్యాదులు, వృక్షములు మనుష్యులుగా జన్మిస్తాయని కాదు. అలా జరగదు. మనుష్యులు తమ కర్మల లెక్కాచారము మానవ జన్మలోనే పొందాలి. మనుష్యులకు అధికములో అధికము 84 జన్మలుంటాయని కూడా మీకు తెలుసు. మిగిలినవారు ఎవరెవరు ఎంతెంత వెనుక వస్తారో వారి జన్మలు కూడా అంత తక్కువగా ఉంటాయి. ఈ లెక్కాచారమంతా ఇప్పుడు మీ బుద్ధిలో ఉంది. ఆ లెక్కాచారమనుసారము, ఇప్పుడిది మన అంతిమ జన్మ అని మీకు తెలుసు. ఇందులో ఇప్పుడు మనము నూతన తరాలు లేక సుఖమునిచ్చు అనేక జన్మల ప్రాలబ్ధమేదైతే ఉందో దానిని తయారు చేసుకోగలము. కనుక ఈ జన్మకు అన్నిటికంటే ఉత్తమమైన జన్మ అని మహిమ ఉంది ఎందుకనగా ఇందులో మనము ఉత్తములుగా కాగలము. అందువలన ఈ జన్మలో మనము చాలా గమనముంచాలి, దీనిని చాలా కాపాడుకోవాలి.

ఈ సమయములోనే పరమాత్మ వచ్చి ఇప్పుడు మనకు స్వయాన్ని ఉన్నతంగా తయారు చేసుకొను శక్తినిస్తున్నారు. కనుక ఇప్పుడు వారి నుండి లభించే బలము తీసుకునే తీరాలి. అలాగని ఈ జన్మలో మనము ఆటోమటిక్‌గా ఉన్నతమవుతామనీ కాదు. అలా జరగదు. తయారు చేయువారు వచ్చినపుడు వారి ద్వారా స్వయమును తయారు చేసుకోవాలి. ఎలా తయారు చేసుకోవాలి? వారి ఆజ్ఞ లేక మతము ఏదైతే లభిస్తూ ఉందో దాని ద్వారా తయారవ్వాలి. అయితే ఇప్పుడు వారి మతము లేక ఆదేశమేది? అది బుద్ధిలో మంచి రీతిగా ఉంది కదా. " బి హోలి అండ్ బి యోగి" నన్ను స్మృతి చేయండి, పవిత్రులుగా ఉండండి. ఈ మాటను మీ బుద్ధిలో మంచి రీతిగా ఉంచుకొని వారి ఆజ్ఞానుసారము స్వయాన్ని నడిపించాలి. అప్పుడు మీ సౌభాగ్యమును ఉన్నతంగా చేసుకోగలరు లేక సదా ఆ సుఖవంతమైన ప్రపంచములోని సుఖమును పొందగలము. ఇదంతా కల్పన అని భావించడం లేదు కదా. అటువంటి ఆలోచనలు వచ్చుట లేదు కదా. కల్పన అని ఎందుకు భావించాలి? ఇది దుఃఖ ప్రపంచమని ఇప్పుడు మనము చూస్తూనే ఉన్నాము. ఇది కల్పన కాదు, ఇది వాస్తవము. కనుక సుఖ ప్రపంచము కూడా ప్రాక్టికల్‌గా ఉండి తీరాలి. అదిప్పుడు లేదు. కాని ఉండాల్సిందే కదా. ఈ ప్రపంచము సదా దుఃఖమునిచ్చేది కాదు కదా? ఇందులో సుఖ, దుఃఖాలు రెండూ ఉన్నాయి. కాని సుఖానికి సమయముంది. అలాగని ఇప్పుడేదైతే సుఖముందో అదే సుఖము, ఇదే స్వర్గమని కాదు. సుఖ, దుఃఖాలంటే ఇవే అని అనుకోకండి. ఇప్పటి సుఖమును సుఖమని అనరు. ఆ సుఖములో మనము సదా సుఖముగా ఉండేవారము. ఆ సుఖమే వేరు కనుక దానిని సుఖమంటారు. ఈ రోజు ఆ సుఖమును కల్పన అని ఎందుకు భావిస్తారు? ఎందుకనగా ఆ సుఖమిప్పుడు లేనే లేదు. కాని దీనిని మన వివేకముతో, ఈ జ్ఞాన బలముతో దుఃఖ ప్రపంచమున్నపుడు, సుఖ ప్రపంచము కూడా ఉండి తీరాలని అర్థము చేసుకుంటాము. చాలా మంది సుఖానికి మార్గమును ఇలా కూడా తెలుపుతారు

- భలే దుఃఖము కలిగినా, నేను సుఖముగా ఉన్నానని భావించు. అందువలన కొంతమంది సుఖము కావాలనే కోరికే ఉండరాదని భావిస్తారు. ఆ కోరికంటే ఏమిటో తెలియనివారుగా కావాలి అని చెప్తారు. ఆ కోరిక ఎందుకు కోరుకోవాలి, ఏమి జరిగినా అందులోనే సుఖముందని భావించు. భలే రోగము రానీ, అకాలమృత్యువు జరగనీ, దుఃఖము కలిగించు ఏ విషయము జరిగినా మీరు స్వయమును సుఖంగా ఉండమని భావించమంటారు. అది మీ కల్పనలోని సుఖము, దానిని ప్రాక్టికల్ సుఖమని అనరు. ఇప్పుడు ప్రాక్టికల్‌గా దుఃఖముంది, ప్రాక్టికల్ జీవితములో దుఃఖము కలిగించు విషయాలు వస్తాయి. అలా సుఖము కూడా ప్రాక్టికల్‌గా ఉండాలి. కనుక దాని సమయమనుసారము మరలా ఆ సుఖ ప్రపంచము రావాలి, కాని అందుకు పునాది ఇప్పుడే వేయాలి. దాని కొరకు మనము ఇప్పుడే మన కర్మలను శ్రేష్ఠముగా తయారు చేసుకోవాలి ఎందుకనగా ఇది కర్మక్షేత్రము, కర్మ భూమి. కనుక ఏది నాటుతామో అదే పొందుతాము. ఇందులో ఈ నియమము కూడా ఉంది. ఈ చట్టమును నేను కూడా ఉల్లంఘించలేను. నేను సర్వశక్తివంతుడనే కాని నేననుకుంటే ఆకాశమును క్రిందికి, భూమి పైకి చేస్తానని కాదు. భగవంతుడు ఏమైనా చేయగలరని, కావాలనుకుంటే మరణించినవారిని బ్రతికిస్తారని వారు భావిస్తారు. కాని భగవంతుని శక్తికి అర్థము చనిపోయిన వారిని బ్రతికిస్తారని కాదు. ఆ ఆత్మ శరీరమును వదలాల్సి ఉండినది, వదిలింది. ఒకవేళ నేను బ్రతికిస్తే, మరలా శవముగా కారా? మరలా శవముగా అవుతారు. కనుక ప్రతి వస్తువు దాని నియమానుసారము నడవాల్సిందే, కనుక ఇందులో శక్తిని చూపించే మాటే లేదు.

ఈ పంచ తత్వాలలో ప్రతి తత్వానికి దాని నియమముంది, అవి కూడా బంగారు, వెండి, రాగి, ఇనుప యుగముల అనుసారము తమ స్టేజీలలో వస్తాయి. భూకంపాలు, వరదలు, తుఫానులు మొదలైనవన్నీ జరుగుతాయి. ఇవన్నీ ఇప్పుడు తమోప్రధానమైపోయాయి, క్రమము తప్పిపోయాయి. ఇప్పుడు ప్రతి వస్తువు తమోప్రధానముగా ఉంది. ఈ రహస్యము కూడా తండ్రి ఇప్పుడు తెలుపుచున్నారు - ఈ సమయములో అన్ని వస్తువులు చెడిపోయాయి. ఇప్పుడు నేను వచ్చి అన్నిటిని బాగు చేస్తాను. అలా చేయుటకు మొదట నేను మనుష్యాత్మలను సరి చేస్తాను, దాని వలన అన్ని వస్తువులు సరిపోతాయి, చక్కబడతాయి. బాగుపడిన ప్రపంచములో సదా సుఖముంటుంది. అప్పుడు ఏ వస్తువు కూడా పరస్పరము దుఃఖమిచ్చుకోదు. ఇప్పుడు ఏ వస్తువు నుండి అయినా దుఃఖమే లభిస్తుంది. ఈ విషయములన్నీ తెలుసుకొని, ఈ సృష్టిచక్రము, ఈ ప్రపంచ చక్రము ఎలా తిరుగుతూ ఉందో అర్థము చేసుకొనుటనే జ్ఞానమని అంటారు. నేను ఇందులో నాలెడ్జ్‌ఫుల్, నా వద్ద ఈ జ్ఞానము ఫుల్(పూర్తి)గా ఉంది. కర్మల ఖాతా ఎలా తయారవుతుంది, నంబరువారుగా ఎలా వస్తారు, ఈ విషయాలన్నీ నాకు తెలుసు. అందుకే ఏ మనిషి కూడా జ్ఞానమును యదార్థ రీతిగా అర్థము చేసుకోలేరని అంటారు. ఎందుకనగా మనుష్యులందరూ ఈ చక్రములో తిరిగే వారే. ఈ చక్రములో తిరిగేవారు ఈ విషయాలను అర్థము చేసుకోలేరు. ఈ చక్రములోకి ఎవరు రారో, వెలుపల ఉంటారో, వారి వద్దనే ఈ జ్ఞానము పూర్తిగా ఉంటుంది. కనుక తండ్రి చెప్తున్నారు - మరలా నేనే వచ్చి వినిపిస్తాను,

ఎందుకనగా ఈ జ్ఞానము నా వద్ద మాత్రమే ఉంటుంది. మిగిలిన వారంతా మర్చిపోతారు. కనుక అందరికీ బలమునిచ్చేది కూడా నేనే, నాలోనే ఈ శక్తి ఉంటుంది. ఎందుకంటే మిగిలిన వారందరు జనన-మరణ చక్రములోకివచ్చి తమ శక్తులను కోల్పోతారు. కనుక నేను నా శక్తినిచ్చుటకై వస్తాను. ఇది చాలా డైరెక్ట్ విషయము. ఇందులో తికమక పడే విషయమే లేదు. అందుకే నన్ను పరమాత్మ, సర్వశక్తివంతుడు, సర్వజ్ఞుడు, జ్ఞాన సాగరుడు............ అని మహిమ చేస్తారు. ఈ మహిమ ఊరకే చేసింది కాదు. నేను పని చేశాను, నాకిక్కడ కర్తవ్యముంది, నేను ఇక్కడ చాలా ఉన్నతమైన శ్రేష్ఠమైన కార్యము చేశాను, అందుకే నాకే మహిమ ఉంది. మనుష్యులకు కూడా మహిమ ఎందుకుంటుంది? గాంధి చాలా మంచివారని, శ్రేష్ఠుడని చెప్తారు. ఉన్నతంగా చాలా పెద్దగా ఎత్తుగా ఉండినాడని కాదు, అలా ఎత్తుగా, పెద్దగా లేడు కదా, గొప్ప అనగా వారి కర్తవ్యములో గొప్పతనము. అతను మంచి కర్తవ్యము చేశాడు, కనుకనే అందరూ వారిని గుర్తు చేసుకుంటారు. వారిని అందరూ మహిమ చేస్తారు. అందువలన మానవ చరిత్రలో కూడా ఫలానావారు మంచి పని చేశారని వస్తుంది కదా, దాని అనుసారమే వారికి గాయనము కూడా ఉంటుంది. అలాగే పరమాత్మకు కూడా ఇంత మహిమ ఉందంటే, వారు కూడా మన కొరకు ఏదో మంచి పని చేసి ఉంటారు కదా. అంతేగాని వారు చాలా పైన ఉన్నారు, కనుక వారి శక్తి నడుస్తూ ఉంటుందని లేక వారి కర్తవ్యము నడుస్తూనే ఉంటుందని కాదు. వారు స్వయంగా వచ్చి ఏదో చేశారు. మనుష్యులను ఇంత (లక్ష్మీనారాయణులు) ఉన్నతంగా చేశారు. ఈ విధంగా చేశారు అందుకే వారికింత మహిమ ఉంది. కనుక ఇప్పుడు పరమాత్మ మహిమను, పరమాత్మని కర్తవ్యమును అర్థము చేసుకోవాలి. ధర్మపితలు కూడా వచ్చి వారి కర్తవ్యము చేశారు కనుక వారి మహిమ గాయనము చేయబడింది కదా. గురునానక్ దేవ్, ఏసుక్రీస్తు, బుద్ధుడు మొదలైనవారు కూడా వారి(పరమాత్మ) వైపు చూపించారు కదా. కనుక ఇవన్నీ చాలా శుద్ధమైన, నేరుగా చెప్పిన విషయాలు. వాటిని అర్థము చేసుకొని పురుషార్థము చేయాలి. తండ్రి ఆజ్ఞాపిస్తున్నారు - నన్ను స్మృతి చేయండి. మీ కర్మలను పవిత్రముగా ఉంచుకోండి. వాటి ద్వారానే మీకు స్వర్గాధికారము ప్రాప్తి అవుతుంది. వాస్తవానికి మీరు కర్మలేమో చేస్తారు, కాని తప్పు(రాంగ్) కర్మలు చేస్తారు. దాని ద్వారానే మీ దుఃఖము పెరుగుతూ పోయింది. అందువలన తండ్రి చెప్తున్నారు - ఇప్పుడు తెలుసుకొని వివేకముతో చేయండి. నా మతమును అనుసరిస్తే మీరు చేసే కర్మలు రైటుగా ఉంటాయి. రైటు కర్మల ఆధారముతో సుఖంగా ఉంటారు. మీ కర్మల ద్వారానే తయారగుటగాని, చెడిపోవుటగాని జరుగుతుంది. మనము వాటినెలా చేయాలో, ఏమి చేయాలో తెలుసుకోవాలి, ఇప్పుడు వారే ఆ విధానాన్ని, ఆ జ్ఞానమును ఇస్తున్నారు, దాని పై నడుచుకోవాలి. ఈ విషయాలను అర్థము చేసుకొని ఆ విధముగా మీరు పురుషార్థము చేయాలి.

ఎంత సులభమో, సహజమో చూడండి. దీని కొరకు మనుష్యులు ఎన్నో వేదశాస్త్రాలు, గ్రంథాలు-పురాణాలు, ఎన్నో హఠయోగాలు, ప్రాణాయామాలు మొదలైనవి చాలా చేస్తున్నారు. అన్ని విషయాలు తండ్రి సహజము చేసి, స్పష్టముగా తెలిపిస్తారు. కర్మల ద్వారానే వెళ్లాలి. కాని కర్మలను

చక్కబరచుకుంటూ వెళ్లండి, వాటినెలా(కేవలము కర్మలను) సరిదిద్దుకోవాలి? అని తెలుపుతారు. అందుకొరకు మీరు ఏ విద్వాంసునిగానో, పండితునిగానో, ఆచార్యునిగా గాని కానవసరము లేదు. మీరు మీ కర్మలను స్వచ్ఛముగా చేసుకోవాలి. స్వచ్ఛత(పవిత్రత) అంటే స్పష్టముగా తెలిపిస్తారు - మీరు నన్ను స్మృతి చేయకుంటే పవిత్రముగా కానే లేరు. భలే మీరు ఏ దేవతనైనా స్మృతి చేయండి. ఎవరి యోగముతోనూ మీరు పవిత్రముగా కాలేరు. పాపాలను దగ్ధము చేసే బలము నా వద్ద మాత్రమే ఉంది. కనుక తండ్రి చెప్తున్నారు - నాతో ఎంతవరకు మీకు సంబంధము లేదో అంతవరకు పావనముగా కాలేరు. బల్బుల కనెక్షన్ మెయిన్ పవర్‌హౌస్‌తో ఉంటుంది కదా. ఆ కనెక్షన్ లేకుంటే బల్బులో కాంతి రాదు. అదే విధముగా మీ కనెక్షన్ నాతో ఉండాలి. నేను మెయిన్ పవర్‌హౌస్. కనుక నాతో కనెక్షన్ ఉండాలి కదా. వారితో కనెక్షన్ లేకుంటే మీకు శక్తి లభించదు. శక్తి లభించకుంటే పాపాలు దగ్ధము కావు. పాపాలు దగ్ధము కాకుంటే మీరు ముందుకు పోలేరు. అందుకే నా ఒక్కరితోనే యోగము చేయండి అని చెప్పారు. నేను లేకుంటే మీకు గతి-సద్గతి జరగదు. మంచిది.

**మధురాతి మధురమైన పిల్లలకు ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్**

**వరదానము:- "యజ్ఞ సేవ ద్వారా సర్వ ప్రాప్తుల ప్రసాదాన్ని ప్రాప్తి చేసుకునే ఆల్‌రౌండ్ సేవాధారీ భవ"**

సంగమ యుగములో ఆల్‌రౌండ్ సేవ చేసే అవకాశము లభించుట కూడా డ్రామాలో ఒక లిఫ్ట్. ఎవరైతే ప్రీతిగా యజ్ఞములో ఆల్‌రౌండ్ సేవ చేస్తారో వారికి సర్వ ప్రాప్తుల ప్రసాదము స్వతహాగా ప్రాప్తి అవుతుంది. వాళ్లు నిర్విఘ్నంగా ఉంటారు. ఒకసారి సేవ చేశారంటే వేయిసార్లు ఆ సేవకు ఫలితము ప్రాప్తమైపోతుంది. సదా స్థూల, సూక్ష్మ లంగర్లు తగుల్కొని ఉండాలి. ఎవ్వరినైనా సంతుష్ట పరచడం అన్నిటికంటే గొప్ప సేవ. అతిథి మర్యాదలు చేయడం అన్నిటికంటే గొప్ప భాగ్యం.

**స్లోగన్ :- "స్వమానంలో స్థితమై ఉంటే అనేక ప్రకారాలైన అభిమానము స్వతహాగా సమాప్తమైపోతుంది"**